# దుమ్ము పడుద్ది!

- జడ్చర్ల పట్టణంలో ముందుకుసాగని రహదారి పనులు
- కంకర వేయడంతో కమ్ముకుంటున్న దుమ్ము
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- నెమ్మదిగా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్
- ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు

దుమ్ములో రాకపోకలు కొనసాగిస్తున్న వాహనదారులు

జడ్చర్లటౌన్, ఏప్రిల్ 9: ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు ముక్కు మూసుకోవాల్సిందే.. లేదంటే ముఖానికి మాస్క్ పెట్టుకోవాలి. ఇది జడ్చర్ల పట్టణ ప్రధాన రహదారి దుస్థితి. 167వ నెంబర్ జాతీయ రహదారి జడ్చర్ల మీదుగా వెళ్తున్న నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. విస్తరణ పనుల్లో భాగంగా ఓ వైపు పట్టణంలోని సిగ్నల్‌గడ్డ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు, అండర్‌పాస్ పనులతో ట్రాఫిక్ కష్టాలు కొనసాగుతుండగా, మరోవైపు డిగ్రీ కళాశాల నుంచి ఎల్ఐసీ ఆఫీస్ వరకు విస్తరణ నిమిత్తం రోడ్డును తవ్వి కంకర, తెల్లపౌడర్ వేయటంతో ఒక్కసారిగా రోడ్డంతా దుమ్ముతో కమ్ముకుంటున్నది. ఒక్కసారిగా బస్సులు, లారీలు రోడ్డు మీదుగా వెళ్లే క్రమంలో దుమ్ము తీవ్రంగా లేస్తోంది. ఈ సమయంలో వాహనదారులు, పట్టణవాసులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. చుట్టుపక్కల ఇండ్లన్నీ దుమ్ముతో నిండిపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై నివాసముంటున్న వారు, దుకాణాల వారు నోటికి పనిచెబుతున్నారు. తమ వ్యాపారానికి ఇబ్బందిగా ఉందని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, బండ్లపై తినుబండారాలు అమ్ముకునే వారు వాపోతున్నారు. రోడ్డు పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నామమాత్రంగా రోడ్డుపై ట్యాంకర్ నీళ్లు పోసి చేతులుదులుపుకున్నాడని, దుమ్ము లేస్తోందని చెప్పినా పట్టించుకోవటంలేదని స్థానికులు మండిపడుతున్నారు. రోడ్డు పనులతో వ్యాపిస్తున్న దుమ్మును గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతోనే సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు పనులను నత్తనడకన కొనసాగిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే రోడ్డు పనులు రాత్రివేళ చేపట్టాలని, పగలంతా రోడ్డుపై నీళ్లు పోస్తూ దుమ్ము, ధూళి లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### కండ్లు మండుతున్నాయి

పట్టణంలో రోడ్లన్నీ మట్టితో కూరుకుపోయాయి. డిగ్రీ కాలేజీ నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు బైక్ వెళ్లాలంటే భయమేస్తోంది. రోడ్డు నుంచి వచ్చే దుమ్ముతో కండ్లు మండిపోతున్నాయి. రోడ్డు పనులు చేసేటప్పుడు దుమ్ము లేవకుండా నీళ్లు పోస్తుండాలి. అసలే ఎండాకాలం రోడ్డు పనులు చేసేటోళ్లు నామమాత్రంగా నీళ్లు పోస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, లారీలు వెనుక వెళ్లాలంటే ద్విచక్రవాహనదారులకు చాలా ఇబ్బందిగా ఉంది. దుమ్ము అంతా మొఖం, బట్టలపైనే పడ్తున్నది. దుకాణాదారులు, హోటళ్లు, టిఫిన్ సెంటర్ల వాళ్లకు చాలా ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. - హఫీజ్, జడ్చర్ల

### రోజుకు మూడుసార్లైనా నీళ్లు పోయాలి

రోడ్డు పనులు చేసేటప్పుడు రోజుకు మూడుసార్లు అయినా నీళ్లు పోయాలి. రోడ్డుపై నీళ్లు పోయకపోవడంతో రోడ్డుపై దుమ్ము లేస్తోంది. బైక్ వెళ్లేటప్పుడూ దుమ్ము అంతా కండ్లలోకి వస్తోంది. లారీలు, బస్సులు వెళ్లాయంటే ముందు వచ్చే వాహనం కనిపించకుండా దుమ్ము లేస్తోంది. రోడ్డు పనులు తొందరగా పూర్తి చేస్తే బాగుంటుంది. రోడ్డు విస్తరణ చేయడం మంచిదే కానీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేయాలి. అధికారులు స్పందించి రోడ్డుపై దుమ్ము లేవకుండా తగిన చర్యలు తీసుకోవాలి. - సేవక్, ద్విచక్రవాహనదారుడు

## సరికొత్త ఆలోచనలతో ముందుకుసాగాలి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఉగాది పచ్చడిని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, ఏప్రిల్ 9 : తెలుగు కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, అలాగే సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉగాది సందర్భంగా జిల్లా కేంద్రంలోని హమాలీ సంఘం ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ నాగరాజు సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం పచ్చడిని పంపిణీ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణాన్ని సంతోష్‌కుమార్ ఆచార్య నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పి.చంద్రశేఖర్, వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి,రాధఅమర్, రాజేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, జగపతిరావు, ఎన్‌పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావాన్ని అలవర్చుకోవాలి

- నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, ఏప్రిల్ 9 : వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ పట్టణ చార్టర్ ప్రెసిడెంట్ కీ.శే. ఘన్‌శ్యాందాస్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణాధ్యక్షుడు సంపత్‌కుమార్ ధరక్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, కోశాధికారి మహేశ్‌గౌడ్, రవికాంత్, లిఖిరఘు, మధుసూదన్, కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంబలికేంద్రం ప్రారంభం

నర్వ: అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నర్వ/ఊట్కూర్, ఏప్రిల్ 9 : మండలంలోని ఉందేకోడ్‌లో మంగళవారం ఉగాదిని పురస్కరించుకొని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి బృందం ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే ఊట్కూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఊట్కూర్ ఆత్మీయ బృందం, సేవా భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం లయన్స్ క్లబ్ అధ్యక్షు డు ఎల్కోటి జనార్ధన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌గౌడ్, మొగిరప్ప, రఘునాథ్, కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

# ఆనందోత్సవాలతో ఉగాది

- పంచాంగాన్ని వినిపించిన పండితులు
- ఆయా ప్రాంతాల్లో పచ్చడి పంపిణీ
- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..

**మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ఆయా ప్రాంతాల్లో షడ్రుచులతో పచ్చడి తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం ఆయా ఆలయాల వద్ద పురోహితులు పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.**

నవాబ్‌పేట : చాకలిపల్లిలో పంచాంగం వింటున్న గ్రామస్తులు

జడ్చర్ల : ఉగాది పచ్చడిని పంపిణీ చేస్తున్న సభ్యులు

మక్తల్ టౌన్, ఏప్రిల్ 9 : మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ఉగాది సందర్భంగా మక్తల్ మండలం భూత్పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. నల్లజానమ్మ ఆలయం వద్ద వీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు భీమ్సేన్ రావు పాల్గొన్నారు.

**జడ్చర్లలో..**

జడ్చర్ల, ఏప్రిల్ 9 : జడ్చర్ల మున్సిపాలిటీతోపాటు మండలంలో మంగళవారం ఉగాది పండగను (క్రోధి నామ సంవత్సరాన్ని) ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. రైతులు ఉగాది రోజు తమతమ వ్యవసాయ పనిముట్లను శుభ్రం చేసి అందంగా అలంకరించి తెల్లవారు జామునే తమతమ పొలాలకు వెళ్లి పొలం దగ్గర వ్యవసాయ పనులను ప్రారంభించారు. అదేవిధంగా గ్రామాలు, పట్టణాల్లో సాయంత్రం వివిధ ఆలయాల వద్ద వేదపండితులు పంచాంగం చదివి వినిపించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

**పచ్చడి పంపిణీ**

జడ్చర్ల మున్సిపాలిటీలోని నేతాజీచౌక్‌లో ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం హిందూ వాహిణి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాంత సంపర్క్ ప్రముఖ్ రాజుగౌడ్, పట్టణ కన్వీనర్ మణిరత్నం, సంతోష్, నాగరత్నం, రమేశ్, మహేశ్, నిఖిల్ ఉన్నారు.

**ఊట్కూర్‌లో..**

ఊట్కూర్, ఏప్రిల్ 9 : ఉగాది కొత్త సంవత్సరంలో ప్రజలకు శ్రమ ఫలితాలతో అంతా శుభం కలుగుతుందని వేద పండితుడు హరి సర్వత్తమాచారి అన్నారు. స్థానిక గోశాల హనుమాన్ ఆలయంలో ఉగాది 'శ్రీ క్రోధి నామ' వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు భక్తులకు పంచాంగాన్ని వినిపించి ఉగాది పర్వదిన ప్రత్యేకత గురించి వివరించారు. క్రోధి నామ సంవత్సరంలో అన్నిరంగాల వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని, దేశం పాడి పంటలతో తులతూగుతుందన్నారు. పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులకు పచ్చడి వితరణ చేశారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మణెమ్మ, మా జీ సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆల య కమిటీ సభ్యులు లక్ష్మారెడ్డి, నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

**కృష్ణ మండలంలో..**

కృష్ణ, ఏప్రిల్ 9 : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. కొత్త సంవత్సరంలో తమ పేర్లపై ఉన్న బలబలాలు, మంచి చెడులు, ఆదాయ వ్యయాలు, రాజ పూజ్యం విషయాలను చెప్పించుకున్నారు.

**నారాయణపేట మండలంలో..**

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 9 : మండలంలోని సింగారం, జాజాపూర్, కొల్లంపల్లి, కోటకొండ, భైరంకొండ, పేరపళ్లతోపాటు తదితర గ్రామా ల్లో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాజాపూర్ ఆర్య సమాజంలో హోమం నిర్వహించి ధ్వజరోహణం చేశారు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భవాని మందిరం వద్ద భక్తులకు పచ్చడి పంపిణీ చేశారు.

**నవాబ్‌పేటలో..**

నవాబ్‌పేట, ఏప్రిల్ 9 : మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మంగళవారం ఉగాది పర్వదినాన్ని వైభవంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం అన్ని గ్రామాల హనుమాన్ ఆలయాల వద్ద వేదపండితులు పంచాంగం చదివి వినిపించారు. అదేవిధంగా ప్రజలకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**రాజాపూర్‌లో..**

రాజాపూర్, ఏప్రిల్ 9 : తెలుగు నూతన సంవత్సర వేడుకలు మంగళవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. కొత్త సంవత్సరం తమ జీవితాలు బాగుండాలని ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. రైతులు వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో వేదపండితులు పంచాంగం చదివి వినిపించారు.

**మరికల్‌లో..**

మరికల్, ఏప్రిల్ 9 : మండల కేంద్రంలో యువక మండలి ఆధ్వర్యంలో మంగళవారం హనుమన్‌వాడ ఆంజనేయస్వామి ఆలయం వద్ద పండితులతో పంచాంగ శ్రవణం నిర్వహించారు అంతకుమందు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా ఆంజనేయస్వామి ఆలయానికి గ్రామస్తులు తరలివచ్చారు. అనంతరం ఆర్ఎస్ఎస్, భగరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, యువక మండలి ఆధ్వర్యంలో పచ్చడి పంపిణీ చేశారు.

**ధన్వాడలో..**

ధన్వాడ, ఏప్రిల్ 9 : మండలంలోని ఆయా గ్రామాల్లో పండితులు పంచాంగ శ్రావణం వినిపించారు. భక్తులకు పచ్చడిని పంపిణీ చేశారు. రైతులు ఉగాది పండుగతో తమ వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

**మిడ్జిల్‌లో..**

మిడ్జిల్, ఏప్రిల్ 9 : మండలంలో ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంతో పాటు వాడ్యాల్, బోయిన్‌పల్లి, కొత్తపల్లి, చిల్వేర్ తదితర గ్రామాల్లో వివిధ ఆలయాల్లో ప్రజాప్రతినిధులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద పూజారులు పంచాంగం చదివి వినిపించారు.

**నారాయణపేటలో..**

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 9 : పట్టణంలోని ఆయా ఆలయాల్లో వేద బ్రాహ్మణులు పంచాంగ శ్రవణం చేశారు. కొత్త సంవత్సరం కావడంతో తమ భవిష్యత్తు ఎలా ఉంటుందోనని రాశిఫలాలు చూయించుకున్నారు. పట్టణంలోని శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో బ్రాహ్మణులు ఉగాది పండుగ ప్రాముఖ్యతను తెలియజేసి పంచాంగ శ్రవణం చేశారు. శ్రీరాఘవేంద్ర స్వామి ఆలయంలో జోషి రఘుప్రేమాచారి పంచాంగ శ్రవణం చదివారు.

**గండీడ్ మండలంలో..**

గండీడ్, ఏప్రిల్ 9 : ఉగాదిని పురస్కరించుకుని ఆలయాల్లో బ్రాహ్మణులు పంచాంగ శ్రవణం చేశారు. వెన్నాచేడ్‌లో రచ్చబండ వద్ద యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి తయారు చేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. హనుమన్ ఆలయం వద్ద శకటోత్సవం నిర్వహించారు.

**మన్యంకొండలో..**

పాలమూరు, ఏప్రిల్ 9 : మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉగాది సందర్భంగా స్వామివారి అలంకరణ చేసి ప్రత్యేక పంచామృతాభిషేక పూజలు, పారాయణం నిర్వహించారు. వాల్మీకి రామాయణం, బాలకాండ పారాయణం శ్రీరామనవమి వరకు చేపట్టనున్నట్లు ఆలయ ధర్మకర్త మధుసూదన్‌కుమార్ తెలిపారు. వేద పండితులతో ఉగాది పంచాంగ శ్రవణం వినిపించారు. అలాగే మహబూబ్‌నగర్‌లోని సింహగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పద్మావతి శ్రీనివాసస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. టీడీ గుట్ట తిరుమలనాథ స్వామి ఆలయం, టీచర్స్‌కాలనీ రామాలయం, వీరన్నపేట శివాలయంలో, రేణుకా ఎల్లమ్మ ఆలయం, ద్వారకామాయి సాయిబాబా మందిరం, న్యూగంజ్ శివాలయంలో, కాటన్‌మిల్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో, భగీరథకాలనీ ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితులు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో అళహరి రామకృష్ణ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

**నర్వ మండలంలో..**

నర్వ ఏప్రిల్ 9 : మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు. రైతులు వ్యవసాయ పరికరాలకు, పశువులు, ట్రాక్టర్లకు పూజలు నిర్వహించి వ్యవసాయ పనులు చేపట్టారు. ఎంపీపీ జయరాములు, జెడ్పీటీసీ జ్యోతికిరణ్, ప్రకాశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వీణావతి శంకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, తాసీల్దార్ మల్లారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో సుదర్శన్, ఎస్సై కురుమయ్య తదితరులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**మహ్మదాబాద్‌లో..**

మహ్మదాబాద్, ఏప్రిల్ 9 : ఉగాది సందర్భంగా ఆలయాల్లో మంగళవారం పంచాంగ శ్రవణాన్ని పండితులు వినిపించారు. మహ్మదాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రయాణికులకు నాయకుడు వేణుగౌడ్ ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. నంచర్లలో హనుమాన్ ఆలయ అభివృద్ధి కోసం జమలాపూర్ యాదోజీ రూ.51వేల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

## ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు తగ్గించాలి

మహ్మదాబాద్, ఏప్రిల్ 9 : ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు తగ్గించాలని తెలంగాణ సమాచార హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ అన్నారు. మంగళవారం అధిక ఫీజులపై విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపర్చేందుకు పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రైవేటు పాఠశాలల్లో తగిన సౌకర్యాలు లేకపోవడంతో ఇష్టానుసారంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అడ్మిషన్ ఫీజులతోపాటు 50శాతం ఫీజులు ముందుగానే వసూలు చేసి పేదల నడ్డి విరుస్తున్నారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. నిబంధనల మేరకే ఫీజులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాల్, దస్తయ్య, నరేందర్ పాల్గొన్నారు.

### నేడు జిల్లా స్థాయి ప్రేరణ పోటీలు

పాలమూరు, ఏప్రిల్ 9 : మహబూబ్‌నగర్ సమీపంలోని ఏనుగొండ కేంద్రీయ విద్యాలయంలో బుధవారం జిల్లా స్థాయి ప్రేరణ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ తెలిపారు. ఈ ప్రేరణ పోర్టల్ వెబ్సైట్ ద్వారా ప్రభుత్వ, జిల్లా పరిషత్, సీబీఎస్ఈ, గురుకులాలకు చెందిన పాఠశాల స్థాయిలో ఎంపిక చేసిన వారు కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

### నేడు అవగాహన సదస్సు

మక్తల్ టౌన్, ఏప్రిల్ 9 : ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్, కన్వీనర్, హెచ్ఎంలకు ఒకరోజు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వెంకటయ్య ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గంలోని మక్తల్, మాగనూర్, కృష్ణ, ఊట్కూర్, నర్వ మండలాలకు చెందిన హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లకు మక్తల్ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో 10వ తేదీన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

### శతాధిక వృద్ధురాలి ఔదార్యం

చెక్కు అందజేస్తున్న శేషమ్మ

మరికల్, ఏప్రిల్ 9 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సరస్వతీ ఆలయ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన వేముల శేషమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో రూ.25వేలను ఆలయ నిర్మాణ కమిటీ స భ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుల తల్లి ఆలయానికి కుటుంబ సభ్యుల సహకారంతో విరాళం అం దించినట్లు తెలిపారు. శేషమ్మ గతంలోనూ 2020 కరోనా సమయంలో సీఎం సహాయనిధికి రూ.9,999 విరాళంగా అందించింది. కార్యక్రమంలో శ్రీనివాస్‌శర్మ, ప్రభుశర్మ, నాగరాజ్‌శర్మ, వెంకటేశ్వరశర్మ, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొండారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధన్వాడ, ఏప్రిల్ 9 : ఈనెల 16 నుంచి 19వరకు మండల కేంద్రంలో వెలిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించనునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆలయ ప్రాంగణంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వీరభద్రప్ప, రాంచంద్రయ్య, గోవర్ధన్‌గౌడ్, సత్యానారాయణగౌడ్, పటేల్ నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, నర్సింహులు, రంగయ్య, బాలయ్య, నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 9 : మండలంలోని ఏక్లాస్‌పూర్ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, కర్నాటకలోని యాద్గీర్ జిల్లా దంతాపూర్‌కు చెందిన వ్యక్తి 427 గ్రాముల వెండిని తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నారు. వెండికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.31వేలు ఉంటుందన్నారు.

**మద్యం పట్టివేత..**

నారాయణపేట మండలంలోని బొమ్మన్‌పాడ్‌కు చెందిన మహేశ్‌సింగ్ 35.5 లీటర్ల మద్యం తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పక్‌పల్లి చౌరస్తా వద్ద పట్టుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై కృష్ణదేవ్ విచారణ చేపట్టి మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

### కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు

మాట్లాడుతున్న భీంపల్లిశ్రీకాంత్

పాలమూరు, ఏప్రిల్ 9 : తెలంగాణభాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో క్రోధినామ ఉగాదిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పాలమూరు జిల్లా కవులు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, భీంపల్లి శ్రీకాంత్ పాల్గొని కవితలను వినిపించారు. అనంతరం భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు హరికృష్ణ వీరిని సన్మానించారు.

### ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

నర్వ, ఏప్రిల్ 9 : మండల కేంద్రంలో మంగళవారం అంతరాష్ట్ర బండలాగుడు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉగాదిని పురస్కరించుకొని మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర స్థాయి నాలుగు పళ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 11జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నగదు బహుమతితోపాటు షీల్డ్‌ను నిర్వాహకులు అందజేశారు. ప్రథమ బహుమతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లా పుల్లేటిపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డి మొదటి బహుమతి, రెండో బహుమతిని కూడా అదే రాష్ట్రానికి చెందిన నంద్యాల జిల్లా కొత్తకోటకు చెందిన గుర్నాథ్ దక్కించుకున్నారు. మూడవ బహుమతిని వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఆరేపల్లికి చెందిన రైతు తిరుపతయ్య కైవసం చేసుకున్నారు. నాలుగో బహుమతిని గద్వాల జిల్లా మద్దెలబండకు చెందిన పొంగుటన్న దక్కించుకోగా, ఐదో బహుమతిని కూడా గద్వాల జిల్లా సాంతర్లకు చెందిన ఎస్ఎస్‌కే బుల్స్ కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బంగా లక్ష్మీకాంత్‌రెడ్డి, సు